


# దివ్యయాత్ర

పెనుమర్తి వెంకటరత్నము గారు

౧

చామనచాయగలవాఁడు. కమలములవలె నున్నను లేకపోయినను నందము లొలుకు నేత్రములు. హృదయమార్దవము నేత్రచ్ఛాయలలో విహరించుచున్నది. ముఖవికాసమునఁ జింతామేఘము లున్నను, బాహ్యప్రకటనమంత బాగుగయుండలేదని యనఁజాలము.

'ఇరువదేఁడులుండునేమో! ఏమిచిత్రము! ఆనందధామమునఁ దిరుగు నీవయోవసంతవేళల నీవిరాగితావృత్తియేమి? ఆహా! ఆనడలలో సౌందర్యదేవీవదనచ్ఛాయ లధ్యయనము చేయుచున్నవి.'

అని విజయపురిలోనియౌవతమున గుసగుసలు బయలుదేఱెను. ఆమూఁగిన గుంపులో నాకుమారునిఁ గని ముగ్ధలైనవారు తరుచు. వెన్నవంటి వారి హృదయవృత్తి ద్రవీభూతమై, అసహజమైన యౌయౌవనాతిథివేషమున నానందముతోఁగూడిన దుఃఖాశ్రువుల వెలిపెట్టినది.

నవయౌవనుఁడగు నాయోగి తను నీక్షించు నాకామినీబృంద ముగ్ధావలోకనములకుఁ బరాఙ్ముఖుఁడై, మా— [illegible]జవీధినుండి ప్రశాంతగంభీరముగ నడచిపోవుచుండెను. తన ప్రియురాలినిబాసి విరహగీతము పాడుకొనుచు నొక విహంగమట్టె పరువిడెను. ఆకసమున మబ్బులు కారుక్రమ్ముకొనుచుండెను.

౨

శిశిరకుఁ జిన్ననాఁటనుండియు బొమ్మల పెండ్లిండ్లుచేసి వినోదించుట యపారముగు నానందమూలకందము. ఆశైశవసామ్రాజ్యపట్టాభిషిక్తయైన శిశిర తన కాలమంతయు నీరకముగ ఆటపాటలలో వినియోగించుచుండెను.

కలవారి బిడ్డయగుటచే శిశిరకు చెలిమికాండ్రు, చెలికత్తెలు అనేకులుండి, యాపెతో నాడుకొనుచు తమ యానందరసమున కుత్పత్తిస్థానమైన శిశిరకుమారిక యెడ నతిసౌహార్దముతో మెలంగుచుండిరి.

కాలము గడచినది. శిశిరకు శైశవలీలలోని వ్యాపారము లనుభవనీయములగుటకుఁ గాలపురుషుఁడు యౌవనశంఖము నూదినాఁడు. చెలిమిచేయువారెల్లరు పెద్దవారయి యెవరిత్రోవ వారు గనుఁగొనిరి. కాని అందరిలోన శిశిరకు వసంతునిమీఁద ప్రేమ యగాధ

ము నపారమును. శిశిరనువిడిచి వసంతుఁ డుండలేఁడు! వసంతుని వీడి శిశిర యుండలేదు. బాల్యమునాఁడే నాటుకొని నల్దిక్కులకు వాసనలు చిమ్మిన యీ తీఁగె పూచి ఫలవంతమగు కాలమాసన్నమైనది.

వసంతుఁడు పేదయింటివాఁడు. పూటగడువని నిరుపేద. కాని యతనిహృదయము శిరన్నదివలె నైర్మల్యభాగధేయము.

3

శిశిర కిప్పుడు పదుమూఁడవయేఁడు మన్మథుఁడు స్థాన పెట్టిన యౌవనమూర్తి సౌందర్య నిధానమైనది. శిశిర ప్రతిదినము పూఁదోఁటలోని కేగి తోఁబుట్టువువోలె నొకచిఱు మల్లెతీవను పెంచుచుండెను. ఆమల్లె దినదిన ప్రవర్ధమానమై, గుబురుకొని యున్నది. శిశిర ప్రతిసాయంతనము మల్లికామంటపమున నాసీనయై, చదువుకొనుచుండును. మలయపర్వతమునుండి వీతెంచు గాలికెరటము లామూర్తికి శైత్యము ప్రసాదించి భావసమాధికిఁ గొంపోవును. శిశిర యీనాఁ డామల్లెపొదకడ శయనించియున్నది. దక్షిణమునుండి గంధవాహుఁడామెను కుశలప్రశ్న చేసి మందగమనుఁడై పోయెను. శిశిరకు నిద్దురవచ్చెను. జగన్మండలమంతయు నామెకుదృశ్యమైనది. ఆజగత్తున నొకమహత్తరమగు తేజఃఖండము దిగంతములకుఁ బ్రాకి వెలుఁగుచుండెను. ఆతేజస్సున నొకయవ్యక్తమూర్తి యామెకుఁ బ్రత్యక్షమయ్యెను. ఆమూర్తినిజూచి యామె తన్మయతనొంది రసైకస్రవంతిలో మునిఁగెను. మరల నొకగాలితరఁగ: మల్లెపై సోఁకెను. క్రూరదంష్ట్రావికృత హాసములతో నొకభయంకరవ్యక్తి శిశిరకుఁ గనఁబడెను. ఆతఁడు తన కృపాణమునుజూపి బెదరించుచుండెను. శిశిర చలించెను. కనులు తెరచెను. మల్లెపొద నిలుపున మాడిపోయెను. మెత్తఁదనపు నిగారములన్నియు ప్రళయవారిధిలోఁబడెను. శిశిర మూర్ఛిల్లెను. భయములేదని యొకయవ్యక్త ఘోషము విని యామె తెప్పిరిల్లినది.

౪

వసంతుఁడు పేదవాఁడని, శిశిరమనోరథము శూన్యము గావింపఁబడినది. వారిదంపతీత్వము నైష్ఫల్య కృపాణముచే ఛేదింపఁబడియెను. శిశిరవివాహము జరిగినది. ఎవరో బందుగులలో నొకరిని గట్టిరి. కాని శిశిరహృదయములో 'భయములేద'ను నిర్ఘోషము పెళ్లివారివాద్యఘోషములలోఁగూడ మ్రోఁగుచుండెను. శిశిర కానందవాహినిలోని కెరటముల చల్లఁదనము గానరాలేదు. పెళ్లివారందరును పుష్టిగా తుష్టిగా భోజనములుచేసిరి. ఈదాంపత్యము చాలా బాగున్నదని వినుతించిరి.

'శశినముపగతేయం కౌముదీమేఘముక్తా
జలనిధి మనురూపం జహ్నుకన్యావతీర్ణా
ఇతిసమగుణయోగప్రీతయ స్తత్రపౌరాం'

అని కాళిదాసునిశ్లోకము చదువుకొనిరి. తమ దేహము తామే యెఱుఁగని యీ పెండ్లి యుత్సవములో వసంతు డెక్కడకు పోయెనో యెవ రెఱుఁగుదురు? ఎఱుఁగవలయునన్న నవసర మెవరికిని [illegible]

౫

శిశిరఋతు వాసన్నమైనది. కమలముల కు బాధ తాళజాలనిదైనది. ఆ నిద్దపుఱేకులు వాడిపోవుచున్నవి.

* * * *

శిశిర మంచము పట్టినది. దిన దినము కార్శ్యమా పెయంగములతో చెలిమిఁ జేయవ చ్చుచుండెను. ముఖము పాండురమై వివర్ణ మైనది. దేహమున రక్తచ్ఛాయ క్షైణ్యము భజించుచుండెను.

వ్యాధిముదిరి భయంకరమగు సన్నిపాత ము క్రింద మారినది. వైద్యులు యావచ్ఛక్తి ని వినియోగించి పోయవలసినమందులుపోసిరి. బంధుమిత్రులయొక్క ఆశలు చితికి చీలికలైపో యినవి. నేఁటి కిరువదిరోజులు గడిచినవి. ఇఁక రెండురోజులలో వ్యాధి తిరుగుననిరి. భగవం తునిమీఁద నాధారమువేసిరి. నేఁడు జ్వరము తీక్ష్ణముగానున్నది. శిశిర మంచమునుండి లేచి లేచిపోవనారంభించెను.—

'ఓ కరాళమూర్తీ! రమ్ము! భయములే దు! నీ కత్తినాకిమ్ము! నేను కత్తితో నాట్య మాడెదను. నెత్తుటిలో అమృతము చూపిం చెదను. నేఁడు విశ్వమాత పిలుచుచున్నది. అదుగో! వసంతుఁడు, మాధవుని మధుర మూర్తి! చిగురు చేతులు చాచి పిలుచు చున్నాఁడు. పూల నవ్వులుగురియుచున్నాఁడు. మృత్యుదేవి నావసంతుని భయపెట్టుచున్నది. బలే! సెబాసు! మృత్యుదేవి పాఱిపోవు చున్నది. ఓ మృత్యుదేవీ! రమ్ము! ఆడుకొం దమురమ్ము! వసంతా! రమ్ము! మృత్యుదేవి తో ఆడుకొందము.—అదిగో నామాత! విశ్వ మాత! జగద్ధాత్రి! పిలుచుచున్నది. వసంతా, రమ్ము కత్తులరథములో పోవుదమురమ్ము!— భయములేదు! నామల్లెతీవ మాడ్చినవాఁడేడీ? రా. ఇటురా. నిన్ను మా మృత్యుమాతచే కొట్టించెదను. అదిగో! ఆనందనోద్యానము వసంతుఁడు పిలుచు చున్నాఁడు. కోయిలలు పాడుచున్నవి. రా. పో. పో' అనిప్రలాపింప సాగెను.

౬

ద్వారదేశమున గీతము వినఁబడెను. శిశిర కాయాసముపుట్టెను. ఝంఝూ మారుతము తీవ్రముగ వీచెను. చెట్లు ఫెళ్లు ఫెళ్లుమని విరిగి పడుచుండెను. ఆకాశమున కారుమబ్బులు క్రమ్మి లోకమున చీకట్లు పేర్చెను. భిక్షువు గీతము పాడుచుండెను.

గీతి

"ప్రళయానిలంబులోఁ బ్రళయంబు మ్రోఁగ
విలయాగ్నిలోనఁ దేశలు పొంగిపోయె
కారు మబ్బులలోన కాంతి పుంజములు
దిగనంతవీధిలో సాగసి పోయినవి
ఆనందలోకాన నదిగో పికంబు!
శాశ్వతప్రణయ సంచార గీతులుపాడు"

శిశిర తటాలున లేచి పరుగు పరుగున వచ్చినది. భిక్షువు గీతముపాడుచు నేయుండెను. శిశిర భిక్షువు కడకువచ్చి బాహు వల్లరులు సాచినది. భిక్షువు కంఠమున గీతము మ్రోఁగుచు నేయున్నది. ప్రళయ ఝంఝూ

నిలంబు వీచి సముద్రమున తుపాను పుట్టెను. ఆ పరిష్వంగమునుండి ఏకమగు దివ్య తేజము మిన్ను ప్రాకినది. సముద్రము పాడినది.

"తేనెవాకలలోన తేలిపోదాము
పూవునాకలలోనఁ బొరలివద్దాము
దివ్యయాత్రకుపోయి దేవకన్యలకు
సాగరగీతముల్ ప్రోగుచేద్దాము"

దేహళీవర్తియగు పంజరము నుండి చిలుక యెగిరిపోయి వసంతుని నాశ్రయించినది. పంజరము శూన్య గీతుల బాహిరిల్లినది.

# *తృష్ణా గీతము

విశ్వనాథ సత్యనారాయణ గారు

'ఇది మహావర్షఋతువుపై నీసిశాసమాత్ర
మయము భీకరమయ్యె నామనసు
మీభయంకరరూపమ్మునే వరించు
నేయగాధమ్ములోదిగునో! యిదేమి?'

'నాదు దురవస్థగని నిశానలిననేత్రి
కనులవెంట బాష్పమ్ములు కార్చదొడగె
నాకును భయమ్మె గలిగెడు నామనస్సు
మాత్ర మేటికో చీకట్లు మలచుకొనెడు.'

'గాఢతిమిరంపు దుప్పటికప్పుకొనియె
చలికి బెదరినదనఁగ నిశాలతాంగి
ఆముసుఁగులోకి నన్ను రమ్మనుచునున్న
దటకు పోవలెనని నాకు నాశ మొందు.'

'ఈతమశ్శీల శర్వరి యెల్లలోక
మావరించెను వర్షంబు లంతకంత
కధికమై యుప్పెనంబోలె నలముకొనియె
ప్రథితమార్గంబులను పరీవాహసమితి'

'కడగియుఱిమిన జీవలోకంబులెల్ల
బధిరితంబౌనో పిడుగులుపడి జగంబు
సమసిపోవునో యిట్టివర్షంబుకతన
ప్రలయజలరాసి లోకంబుపైనబడునో.'

('నవరత్నశాల' నుండి)

---

* All Rights Reserved.